కాల విభాగములు

(సరళ వివరణ:డి.నారాయణ రావు, విద్యానగర్, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రం)

ముహూర్త వర్ణనం

దినమానం యొక్క 15వ భాగం ఆ రోజు యొక్క ఒక ముహుర్తమగును. అలాగే రాత్రిమానం యొక్క 15వ భాగం ఆ రాత్రి యొక్క ఒక ముహూర్తమవుతుంది. శుభకర్మలకు యోగ్యమైన కాలాన్నికూడా ముహూర్తం అంటారు. స్థూలంగా 2 ఘడియల (48 నిమిషాల) కాలం ఒక ముహూర్తం అనవచ్చు. పగలు 15 ముహూర్తాలు, రాత్రి 15 ముహూర్తాలు వెరసి 30 ముహూర్తాలు అంటే 60 ఘడియల కాలం స్థూలంగా ఒక అహోరాత్రం (దినం). పగటి 15 ముహూర్తాలు ఇవి, 1.రుద్ర 2.ఉరగ 3.మిత్ర 4.పిత్ర్య 5.వసు 6.వార 7.విశ్వేదేవ 8.విధి 9.బ్రహ్మ 10.ఇంద్ర 11.ఇంద్రహుతాశన 12.దైత్య 13.వరుణ 14.ఆర్య 15.భగ ముహూర్తములు. ఇందులో రుద్ర, ఉరగ, పిత్ర్య,ఇంద్రహుతాశన, దైత్య, భగ ఈ ముహూర్తాలు అశుభాలు. రాత్రి పంచదశ ముహూర్తాలు ఇవి. 1.ఈశ్వర 2.అజచరణ (అజ) 3.ఆహిర్బుధ్న్య 4.పూష 5.నాసత్య 6.అంతక 7.వహ్ని 8.ధాత 9.శశి 10.ఆదిత్య 11.జీవ 12.అచ్యుత 13.అర్క 14.త్వష్ట 15.సమీరణ ముహూర్తములు. ఇందులో ఈశ్వర, అంతక, వహ్ని ఇవి అశుభాలు.

దినంలో5 భాగాలు

ఒక దినం (పగలు) లో 5 భాగాలు చేసినపుడు సూర్యోదయంనుండి 3ముహూర్తాల (6 ఘడియల) వరకు ప్రాతఃకాలము, తరువాత 3 ముహూర్తాల వరకు సంగమకాలము, తరువాత 3 ముహూర్తాల వరకు మధ్యాహ్నకాలము, తరువాత 3 ముహూర్తాల వరకు అపరాహ్ణకాలము, చివరి 3 ముహూర్తాలవరకు సాయంకాలము. అందులో సాయంకాలం సామాన్యంగా అన్ని కార్యాలకు అశుభమే. పోతే శ్రాద్ధకర్మలయందు అపరాహ్ణకాలం ముఖ్యం. శ్రాద్ధతిథి అపరాహ్ణవ్యాప్తి ఉన్న రోజున శ్రాద్ధకర్మ నిర్వర్తించాలి.

దినంలో 4 భాగాలు

దినమానాన్ని 4 సమాన భాగాలు చేసినపుడు ఒక్కొక్క భాగాన్ని "ప్రహర" లేదా "యామం " (ఝాము) అంటారు. సూర్యోదయం నుండి మొదటి ప్రహరను పూర్వాహ్ణము,రెండవ ప్రహరను మధ్యాహ్నం, మూడవ ప్రహరను అపరాహ్నం, నాలుగవ ప్రహరను సాయాహ్నం అని అంటారు. స్థూలంగా ప్రహరకాలం 3 గంటలు లేదా 7.5 ఘడియలు. సూర్య.చంద్ర గ్రహణాలలో వేధారంభాన్ని నిర్ణయించడానికి ఈ ప్రహరలు ఉపకరిస్తాయి. సూర్యగ్రహణంలో ఏ ప్రహరలో గ్రహణస్పర్శ ప్రారంభమవుతుందో ఆ ప్రహరకన్నా అంతకుముందు 4 ప్రహరలనుండి వేధ ప్రారంభమవుతుంది. చంద్రగ్రహణ విషయంలో గ్రహణస్పర్శ ఆరంభమయ్యే ప్రహరకన్నా అంతకుముందు మూడు ప్రహరనుండి వేధ ప్రారంభమవుతుంది

దినంలో 3 భాగాలు

దినమానంలో 3 సమాన భాగాలు చేసినపుడు మొదటి భాగాన్ని పూర్వాహ్ణం అంటారు. ఇందులో దైవ కార్యాలు చేస్తారు. రెండవ భాగాన్ని మధ్యందినమంటారు. ఇందులో మనుష్యులకు సంబంధించిన కార్యాలు చేస్తారు. మూడవ భాగాన్ని అపరాహ్నం

అంటారు. ఇందులో పితృ సంబంధిత కార్యాలు చేస్తారు. కాత్యాయన శాఖ వారు చేసే పిండ పితృ యజ్ఞంలో ఇట్టి విభాగం అవసరమౌతుంది.

దినంలో 2 భాగాలు

దినమానాన్ని రెండు సమాన భాగాలు చేసినపుడు మొదటి భాగం పూర్వాహ్ణం. రెండవ భాగం అపరాహ్ణం. పూర్వాహ్ణ కాలంలోని చివరి ఘడియ మరియు అపరాహ్ణ కాలారంభంలోని మొదటి ఘడియ, ఈ రెండు ఘడియలను "ఆవర్తనం" అంటారు. దీన్నే మధ్యాహ్నం అని కూడా అంటారు.

సంధ్యాకాల వర్ణనం

సూర్యోదయాత్పూర్వం నక్షత్రాలు కనపడకుండా ఉండి సూర్యోదయం అయ్యేంతవరకు గల సంధి కాలాన్ని ఉదయసంధ్య అంటారు. సూర్యాస్తమయం తరువాత నక్షత్రాలు కనిపించేంతవరకు గల సంధికాలాన్ని సాయం సంధ్య అంటారు. అంటే ఆకాశంలో సూర్యుడు, నక్షత్రాలు కనిపించని కాలాన్ని సంధికాలం (సంధ్యవేళ) అంటారు. సంధ్యవేళలో భోజనం అనిష్టం.

రాత్రిని "త్రియామా" అని అంటారు. అంటే 3 ప్రహరలు (యామాలు లేదా ఝాములు) ఉండేది అని అర్థం .రాత్రిలోని 4 ప్రహరల్లో రాత్రి ఆరంభం అయ్యేముందు సగం ఝాము మరియు రాత్రి సమాప్తి అయ్యే కాలమందలి సగం ఝాము, ఈ రెండు కూడా పగలు లాగానే పరిగణిస్తారు. అంటే నిజరాత్రి 3 ప్రహరలు. సూర్యోదయం ముందు 3 ఘడియలు ప్రాతఃసంధ్యాకాలం. సూర్యాస్తమయం తరువాత 3 ఘడియలు సాయం సంధ్యాకాలం.

ఉషఃకాలాది వర్ణనం

సూర్యోదయం నుండి 55 ఘడియలకాలం దాటిందంటే (అంటే రాత్రి ఇంకా 5 ఘడియలు మిగిలిందనగా) అంటే మరుసటి రోజు సూర్యోదయానికి ముందు 5 ఘడియలనుండి ఉషఃకాలం ఆరంభమవుతుంది. అలాగే సూర్యోదయం నుండి 57 ఘడియలకాలం పూర్తి కాగానే (అంటే రాత్రి ఇంకా 3 ఘడియలు ఉండగా) అంటే మరుసటి రోజు సూర్యోదయానికి ముందు 3 ఘడియల నుండి అరుణోదయకాలం ఆరంభమవుతుంది. సూర్యోదయానికి ముందు 4 ఘడియలనుండి అరుణోదయకాలం అని కొందరి మతం.

సూర్యోదయానికిముందు మరియు సూర్యాస్తమయం తరువాత సూర్యుడు కనుపించకున్నా సూర్యకిరణాలు అంతరిక్ష వాతావరణంపై పరావర్తనం చెందే వివిధ దశలకు ఉషఃకాలం, అరుణోదయకాలం, సంధ్యాకాలం అని పేర్లు.

ప్రదోషకాల వర్ణనం

సూర్యాస్తమయం తరువాత 3 ముహూర్తాల (6 ఘడియల) కాలం ప్రదోషకాలం. సూర్యాస్తమయం తరువాత 3 ఘడియల కాలం ప్రదోషకాలమనీ, సూర్యాస్తమయం తరువాత 2 ఘడియల కాలం ప్రదోషకాలమనీ కొందరి మతం. సూర్యాస్తమయం తరువాత 7.5 ఘడియల కాలం ప్రదోషకాలమనీ మరికొందరి మతం.

నిశీధ వర్ణనం

రాత్రిమానాన్ని 15 భాగాలు చేస్తే ఒక్కొక్క భాగం ఒక ముహూర్తమవుతుంది. అట్టి 8 వ ముహూర్తమును "నిశీధం" అంటారు. మహాశివరాత్రి రోజు మహాశివుణ్ణి నిశీధ కాలంలో పూజిస్తారు.

గోదోహన కాలం

గోదోహనకాలం అంటే ఒక ముహూర్తంలో 8వ భాగం (15 విఘడియలు). మధ్యాహ్నం వైశ్వదేవం చేసిన తరువాత గోదోహనకాల పరిమాణం ఎంతో అంతకాలం (అంతవరకు) అతిథుల కొరకు వేచిచూడాలి.

డి.నారాయణరావు